## ఖైదీలకు వైద్య పరీక్షలు

ఎదులాపురం, జూలై 8 : ఆదిలాబాద్ జిల్లా జైలులో డీఎల్ఎస్ఏ సూచనల మేరకు రిమ్స్, వైద్యారోగ్య శాఖ అధికారుల సహకారంతో సోమవారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ హాజరయ్యారు. హాజరైన వారికి జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. 135 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు చేయగా ఇందులో 62 మంది జనరల్ మెడిసిన్, 30 మందికి ఆర్థోపెడిక్ ,18 మంది ఈఎన్టీ, 12 మంది డెంటల్, 12 మందికి కంటికి సంబంధించిన వారికి వైద్య పరీక్షలు చేశారు. 8 మంది ఖైదీలను తదుపరి చికిత్స కొసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా జైలు సుపరింటెండెంట్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ క్యాంప్ ఏర్పాటుకు సహకరించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి, రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వోలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జైలు అధికారులు సూర్యప్రకాశ్ రెడ్డి, మధు, ప్రకాశ్, కృష్ణ, మెడికల్ క్యాంపులో వైద్యులు నవీన్, వివేక్, భానుజెన్నిఫర్, సచిన్, వైద్యసిబ్బంది దామోదర్, హారిక పాల్గొన్నారు

## జిల్లా కవికి రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న తొడిశెట్టి పరమేశ్వర్

సోన్, జూలై 8 : జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త, ప్రధానోపాధ్యాయుడు తొడిశెట్టి పరమేశ్వర్ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం వేదికపై శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'విశిష్ట సాహితీ ప్రతిభా పురస్కారాన్ని స్వీకరించారు. ప్రముఖ అధ్యాత్మికవేత్త శ్రీశ్రీ వరకవి సిద్ధప్ప జయంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులను గుర్తించి శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన స్థపతి ఎన్ వి ప్రసాద్, ప్రముఖ శిల్పకళాచార్యుడు మాణిక్యలింగం, నార్లపురం రవీందర్, ట్రస్టు చైర్మన్ ఇటిక్యాల వీరయ్య పాల్గొన్నారు.

## ఫోన్ కొనివ్వలేదని.. క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

తలమడుగు, జూలై 8 : తల్లిదండ్రులు ఫోన్ కొనివ్వలేదని క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తలమడుగు మండలంలో చోటు చేసుకున్నది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ(18) నెల రోజుల నుంచి తన తండ్రి నాగారావును ఫోన్ కొనివ్వమని అడుగుతున్నారు. ఈనెల 3వ తేదీన మరోసారి ఫోన్ కొనివ్వమని అడుగగా.. ఆర్థిక పరిస్థితి బాగాలేదు కొన్ని రోజులు ఊపికగా ఉండమన్నాడు. దీంతో క్షణికావేశంలో కృష్ణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా కనిపించలేదు. సోమవారం ఉదయం ఉమ్రి గ్రామస్తులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి గుట్టపైకి వెళ్లగా కృష్ణ ఉరివేసుకుని కనిపించాడు. శవం కుళ్లిపోయింది. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కృష్ణ అన్న చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. కాగా.. కృష్ణ స్థానికంగానే ఇంటర్ మధ్యలోనే మానేశాడు.

# ఆవిష్కరణలతో ప్రతిభను చాటుకోవాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 8 : ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభను చాటుకునేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఇంటింటా ఇన్నోవేటర్‌పై సమీక్షించారు. జిల్లా కోఆర్డినేటర్ సాయికృష్ణ, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, విద్యార్థులు తయారు చేసిన పలు ప్రదర్శనలు పవర్‌పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా తెలియజేశారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేటర్ అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ,రైతులు సమాజానికి ఉపయోగపడేల అనేక ప్రయోగాలు చేస్తుంటారని, అవి బయటకు రావడం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించేలా డీఈవో, డీఐఈవో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బయటకు తీసుకురావాలన్నారు. చిన్న ఆలోచనతో పరిష్కరించేల అనేకమంది యంత్రాలు తయారు చేస్తున్నారన్నారు. అలాంటి వారు ఇంటింటి ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేల విస్తృత ప్రచారంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి, డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్ , మున్సిపల్ కమిషనర్ ఖమార్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు వీల్ చైర్ అందజేత**

ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామం వివేక్, గాదిగూడ మండలం బొజ్జుగూడ గ్రామానికి చెందిన సంబాజీలు వీల్‌చైర్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం ప్రజావాణిలో వీల్‌చైర్‌లు కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఏసీడీపీవో కె.మిల్కాలతో కలిసి అందజేశారు.

**పాఠశాల తనిఖీ చేసిన కలెక్టర్**

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లు రి, పట్టణంలోని కొలిపుర ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు తీరును, విద్యార్థుల ఏకరూప దుస్తుల ఏర్పాటుపై ఆరా తీశారు. అనంతరం వివిధ సమస్యలను కాలనీ వాసులు కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యలకు సంబంధించిన రిపోర్టును సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆదేశించారు. డీఈవో ప్రణీత, ప్రిన్సిపల్ నారాయణ, జయ ఉన్నారు.

**విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేత**

ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సీడబ్ల్యూఎఫ్ స్కీం ద్వారా ఎన్ఐటీ, ఐఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు ఆర్తి, కోడి రాజకుమార్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ల్యాప్‌టాప్‌లు అందజేశారు.

## జిల్లా కళాకారులకు సన్మానం



జిల్లా కళాకారులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

ఎదులాపురం, జూలై 8 : బోనాల పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ బోనాల జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కవితా వైద్య ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలు చేశారు. ఈ మేరకు శ్రీ వెకంటేశ్వర సంగీత నాట్య కళానిలయము చెందిన కళాకారులు ప్రతిభ కనభరిచారు. కళాకారులను ముఖ్యఅతిథులు దైవాజ్ఞశర్మ, సిని నటి కరాటె కళ్యాణిలు పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి



ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైద్యులు

భైంసా, జూలై 8 : వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని ఎంపీ నగేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ విభాగం, స్కానింగ్ మిషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యమందించాలని సూచించారు. ఈయన వెంట ఎమ్మెల్యే రామారావు పటేల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, అనిల్ కుమార్, విజయానంద్, నాయకులు తదితరులు ఉన్నారు.

## జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సస్పెండ్

నిర్మల్ అర్బన్, జూలై 8 : నిర్మల్ జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాములును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ టెండర్ల వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు రాములుపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అర్హతలు లేని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను సైతం టెండర్లలో పాల్గొనేందుకు అనుకూలంగా టెండర్ ప్రక్రియలో పాల్గొనేట్టు చేయడంతో పాటు మరికొన్ని ఆరోపణలపై విచారణ జరిపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## వ్యక్తి అదృశ్యం

సారంగాపూర్, జూలై 8: చించోలి(బీ) గ్రామానికి చెందిన టీకారం వంశీధర్ అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వంశీధర్ తన ఇంట్లోనే కిరాణా దుకాణం నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. అయితే కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం వేకువజామున 5 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి పోయి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతిన ఆచూకీ కనిపించలేదు. దీంతో వంశీధర్ తండ్రి తన కొడుకు కనిపించడం లేదని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మత్తడి ప్రాజెక్టుకు స్వల్పంగా వరద



ప్రాజెక్టులో వర్షపు నీరు

తాంసి, జూలై 8 : మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని వడ్డాడి మత్తడి ప్రాజెక్టుకు స్వలంగా వరద వస్తున్నట్లు ప్రాజెక్టు జేఈ హరీశ్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 80 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో ఉండగా, నీటిని దిగువకు విడుదల చేయడం లేదని వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 275 మీటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జైనథ్(బేల), జూలై 8 : వర్షాకాలంలో ప్రబలే పలు అంటు రోగాలపై అప్రమత్తంగా ఉండాలని బేల ఎంపీడీవో మహేందర్ సూచించారు. సోమవారం బేల మండలకేంద్రంలో అధికారులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసు కోవాలన్నారు. సమావేశంలో మండల వైద్యులు వంశీకృష్ణ, స్వామి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ, ఏపీవో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

తాంసి(భీంపూర్), జూలై 08 : భీంపూర్ మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గ సమావేశ సన్నహాక చర్యలకు అనుగుణంగా నిర్మాణ రంగంలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎండి గౌస్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికులకు లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా లబ్దిపొందే సంక్షేమ ఫలాలు ప్రతి కార్మికులకు అందింపజేయాలని పిలుపునిచ్చారు. కార్మిక శాఖ అధికారులు భీంపూర్ మండలంలో ప్రత్యేకమైన క్యాంపు ఏర్పాటు చేసి కార్మికులకు లేబర్ కార్డు అందించాలని తెలిపారు. సంఘం బలోపేతానికి భీంపూర్ మండలంలోని ప్రతి కార్మికుడు సంఘంలో సభ్యులుగా చేరి సంక్షేమ ఫలాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగనాథ్, పాండురంగ్, శ్యాంరావ్, బలిరాం పాల్గొన్నారు.

## బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్ రూరల్, జూలై 8 : భూతగాద విషయంలో బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం డీఎస్పీ నాగేందర్‌ను కలిసి తగాద విషయాలను వివరించారు. ఆదివాసీ నాయకుడు దుర్వ మహేష్‌కు చెందిన భూమి విషయంలో పిటీషన్ ఇచ్చినప్పటికి సదురు వ్యక్తిపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇట్టి విషయంపై త్వరగా విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాల బాధితునికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం డీఎస్పీని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జనగ భీముడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడ హన్మంత్‌రావు, సిడాం సోనేరావు, దుర్వ మహేష్, కోట్నాక్ దత్తు, సిడాం భీంరావు తదితరులు ఉన్నారు.

## చోరీ కేసులో రిమాండ్

బైంసా, జూలై 8 : పట్టణంలోని పద్మావతి కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగతనం చేస్తుండగా ముథోల్ మండలం ముద్గల్ గ్రామానికి చెందిన నాగుల రాజును పట్టుకొని కోర్టులో ప్రవేశపెట్టగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యక్తి ఇంతకుముందు ముథోల్ మండలంలోని కొన్ని ఆలయాల్లో దొంగతనం చేయడం జరిగిందన్నారు.

## గొడవ కేసులో..

సారంగాపూర్, జూలై 8 : స్వర్ణ గ్రామానికి చెందిన డోలు నవీన్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. డోలు నవీన్ ఈనెల 5న తన వరుసకు పెద్దమ్మ అయిన డోలు లస్మవ్వతో గొడవ పడి ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. దీనికితోడు గ్రామ ప్రజలందరిని భయభ్రాంతులకు గురి చేశాడు. బాధితురాలు లస్మవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం న్యాయస్థానంలో నవీన్‌ను కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. దీంతో అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ భవిష్య కేసును విచారించి 14రోజుల రిమాండ్‌ను విధించారు.

---

వాణిజ్య

# భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

**ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు**

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

*సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఈఎల్ ఉన్నదీ ఇక్కడే.*

**ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.**

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

**కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్**

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్-బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

**భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం**

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.





ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

### కేసీఆర్ చొరవతో..

*మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయిప్పుడు. మొత్తానికి ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.*





## బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

**ప్రారంభ ధర రూ.66 లక్షలు**

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ-క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

## హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

**వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్**



హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

## ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షలోనూ అంతే ఉండొచ్చంటున్నారు.

## పీఎస్బీల్లో వాటాల్ని అమ్మేయండి

**ఇదే సరైన సమయం: ఎస్బీఐ నివేదిక • సర్కారీ బ్యాంకులు ఇంకా తగ్గాలి**

న్యూఢిల్లీ, జూలై 8: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్బీ)ల్లో వాటాల విక్రయానికి ఇదే సరైన సమయమని సర్కారీ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ సోమవారం తమ రిసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొన్నది. 'బ్యాంకులు ప్రస్తుతం పరిపుష్ఠంగా ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వానికి ఇదే సరైన సమయం. త్వరగా దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి' అని 'కేంద్ర బడ్జెట్ 2024-25కి నాంది' పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో ఎస్బీఐ అభిప్రాయపడింది. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై స్పందిస్తూ '2022 అక్టోబర్‌లో కొనుగోలుదారుల నుంచి బిడ్లను ఆహ్వానించారు. 2023 జనవరిలో ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం)కు కొందరు తమ ఆసక్తిని వ్యక్తపర్చారు. రాబోయే బడ్జెట్‌లో దీనిపై ఓ స్పష్టత రావచ్చు' అని ఎస్బీఐ తెలిపింది. ప్రస్తుతం ఐడీబీఐలో కేంద్రం వాటా 45.48 శాతంగా ఉంటే, ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ వాటా 49.24 శాతంగా ఉన్నది. మిగతా వాటా మైనారిటీ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్నది. అయితే దాదాపు 61 శాతం వాటాను అమ్మేయాలని కేంద్రం, ఎల్ఐసీ చూస్తున్నాయి.

**బ్యాంకుల సంఖ్య తగ్గాలి**

ప్రస్తుతమున్న ప్రభుత్వ బ్యాంకులు మరింతగా ఏకీకృతం కావాలన్న అభిప్రాయాన్ని ఎస్బీఐ వెలిబుచ్చింది. తద్వారా ఇంకా సర్కారీ బ్యాంకుల సంఖ్య తగ్గాల్సిన అవసరం ఉందని చెప్పింది. ఇప్పటికే గతంతో పోల్చితే ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య చాలా తగ్గిపోయింది. ఆయా బ్యాంకుల్లో ఒకటి, రెండు, అంతకుమించి బ్యాంకులు విలీనమైపోయాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 12 సర్కారీ బ్యాంకులే మిగిలాయి. అయినప్పటికీ ఇంకా తగ్గాలని ఎస్బీఐ చెప్తుండటం ఇప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. డిపాజిట్లపై పొందే వడ్డీ ఆదాయంపై పన్నును సవరించాలని ఎస్బీఐ కేంద్రానికి సిఫార్సు చేసింది. మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ మార్కెట్లకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరింది. '2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రజల నికర ఆర్థిక పొదుపు జీడీపీలో 5.3 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇది 5.4 శాతానికే పెరుగవచ్చనిపిస్తున్నది. అయితే మ్యూచువల్ ఫండ్ల రాబడులతో సమానంగా డిపాజిట్ల వడ్డీరేటుంటే సేవింగ్స్ బాగా పెరిగేందుకు వీలున్నది.' అని ఎస్బీఐ ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఈ సందర్భంగా సూచించింది. ఈ నెల 23న ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు.

## స్టార్ ఫిన్‌సర్వ్‌కు ఆర్బీఐ షాక్

న్యూఢిల్లీ, జూలై 8: మరో రెండు బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు రిజర్వుబ్యాంక్ షాకిచ్చింది. అక్రమ రుణ పద్ధతుల కారణంగా స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియాతోపాటు మరో సంస్థ పాలీటెక్స్ ఇండియా లైసెన్స్‌లను రద్దు చేసింది. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియా ప్రొగ్‌క్యాప్, అలాగే ముంబై కేంద్రస్థానంగా పాలీటెక్స్ ఇండియా కార్యకలాపాలు అందిస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ ద్వారా డిజిటల్‌గా రుణాలు మంజూరు, వసూళ్లు నిర్వహించినందుకుగాను స్టార్ ఫిన్‌సర్వ్‌కి చెందిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. కేవైసీ ధృవీకరణ ప్రక్రియ కూడా అవుట్‌సోర్సింగ్ ఇవ్వడం ఆర్బీఐ అభ్యంతరాలు వ్యక్తంచేసింది.

## హైదరాబాద్‌లో సీ1 విస్తరణ

**మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆఫీస్**



హైదరాబాద్, జూలై 8: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ సీ1..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్(జీఐసీసీ)ని మరింత విస్తరించింది. గతేడాది 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అదనంగా మరో 20 వేల చదరపు అడుగుల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డొజు తెలిపారు. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్ 500 సంస్థల్లో సగం తమ క్లయింట్లను, వీటికి ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)ని కూడా ఏర్పాటు చేసినట్లు, దీంట్లో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకునే అవకాశాలున్నాయన్నారు.